అక్టోబర్ 6న భారత్, పాక్ పోరు

- మహిళల టీ20 ప్రపంచకప్ తాజా షెడ్యూల్ విడుదల

దుబాయ్: బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కారణంగా యూఏఈలో నిర్వహించతలపెట్టిన మహిళల టీ20 ప్రపంచకప్-2024 సవరించిన షెడ్యూల్‌ను ఐసీసీ సోమవారం విడుదల చేసింది. అక్టోబర్ 3 నుంచి 20 దాకా దుబాయ్, షార్జా వేదికలుగా జరగుబోయే ఈ మెగా టోర్నీలో భారత్.. అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్ ద్వారా టైటిల్ వేటను ఆరంభించనుంది. దాయాది పాకిస్థాన్‌తో 6న తలపడనుంది. గ్రూపు దశలో టీమ్‌ఇండియా.. 9న శ్రీలంకతో 13న ఆస్ట్రేలియాతో ఆడాల్సి ఉంది. ఈ టోర్నీలో తలపడబోయే పది జట్లను రెండు గ్రూపులుగా విభజించగా గ్రూప్-ఏలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, భారత్, పాకిస్థాన్, శ్రీలంక ఉండగా గ్రూప్-బీలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ ఉన్నాయి. గ్రూప్ దశలో టాప్-2లో నిలిచిన నాలుగు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. అక్టోబర్ 17న తొలి సెమీస్ (దుబాయ్) 18న రెండో సెమీస్ (షార్జా) జరగాల్సి ఉండగా 20న దుబాయ్ వేదికగా ఫైనల్‌ను నిర్వహించనున్నారు.

ప్రణయ్‌కు అనారోగ్యం..

ఆటకు విరామం

చికున్ గున్యాతో బాధపడుతున్న షట్లర్

ఢిల్లీ: భారత టాప్ బ్యాడ్మింటన్ ప్లేయర్ హెచ్ఎస్ ప్రణయ్ చికున్ గున్యా బారిన పడ్డాడు. దీంతో కొద్ది రోజుల పాటు ఆటకు దూరమవుతున్నట్టు తెలిపాడు. ఈ విషయాన్ని సోమవారం అతడే స్వయంగా 'ఎక్స్' ఖాతా వేదికగా వెల్లడించాడు. 'దురదృష్టవశాత్తూ చికున్ గున్యా బారినపడటంతో నా ఆరోగ్యం పాడైంది. ఈ సమయంలో నాలోని అత్యుత్తమ ఆటను ప్రదర్శించడం అసాధ్యం. ఈ విషయంలో నా బృందంతో చర్చించిన తర్వాత నేను పూర్తి స్థాయిలో రికవరీ అయ్యేదాక రాబోయే టోర్నీల నుంచి విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నా. ఈ కఠిన పరిస్థితులలో నాకు అండగా నిలిచినందుకు ధన్యవాదాలు. నేను మళ్లీ బలంగా తిరిగొస్తాను' అని ప్రణయ్ పేర్కొన్నాడు. కాగా అనారోగ్యం బారిన పడ్డ ప్రణయ్ ఎప్పుడు కోలుకుంటాడు? అనేది మాత్రం స్పష్టతనివ్వలేదు.

వినేశ్‌కు 'ఖాప్' స్వర్ణం

పసిడి పతకం ప్రదానం చేసిన సర్వ్‌ఖాప్ పంచాయత్ పెద్దలు

తన పోరాటం ఇప్పుడే మొదలైందని వ్యాఖ్య

బలాలి (హర్యానా): ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో అధిక బరువుతో అనర్హత వేటుకు గురై పతకం తృటిలో చేజారినా 'ఖాప్ పంచాయత్' మాత్రం స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌ను ఘనంగా సత్కరించింది. ఆదివారం వినేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమెకు 'సర్వ్‌ఖాప్ పంచాయత్' స్వర్ణ పతకాన్ని ప్రదానం చేసింది. వినేశ్ అనర్హత వేటును కుట్రగా పేర్కొన్న బలాలి గ్రామపెద్దలు.. ఒలింపిక్ నిర్వాహకులు ఆమెకు పతకం ఇవ్వకున్నా తాము మాత్రం విజేతగానే భావిస్తామని, ఆమెకు స్వర్ణ పతకాన్ని అందిస్తామని గతంలోనే ప్రకటించారు. తాజాగా వాళ్లు వారి వాగ్దానాన్ని నెరవేర్చుకున్నారు. పసిడి పతకం అందుకున్న సందర్భంగా వినేశ్ మాట్లాడుతూ.. 'పారిస్‌లో ఫైనల్ ఆడనందుకు నేను చాలా దురదృష్టవంతురాలినని భావించా. కానీ భారత్‌కు తిరిగొచ్చి ఇక్కడి ప్రజల ప్రేమాభిమానాలు పొందాక నేను అదృష్టవంతురాలినని అనిపిస్తోంది. ఈ పతకం కంటే నాకు మరేదీ గొప్పది కాబోదు' అని తెలిపింది.

పోరాటం ఇప్పుడే మొదలైంది..

ఇదే వేదికపై వినేశ్ తన భవిష్యత్ కార్యాచరణపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన పోరాటం ఇప్పుడే మొదలైందని, ఈ దేశ బిడ్డల కోసం తాను పోరాడతానని వెల్లడించింది. 'నా పోరాటం ముగియలేదు. అది ఇప్పుడే మొదలైంది. భారత అమ్మాయిల కోసం నా పోరాటం ఇప్పుడే ప్రారంభమైంది' అని వ్యాఖ్యానించింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా జరిపిన పోరాటాన్ని వినేశ్ ముందుండి నడిపించిన విషయం విదితమే. కాగా త్వరలోనే ఆమె కాంగ్రెస్‌లో చేరనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

విళ్లపైనే నజర్

బరిలో సూర్యకుమార్, అయ్యర్, సర్ఫరాజ్

నేటి నుంచి ముంబై, తమిళనాడు మధ్య బుచ్చిబాబు టోర్నీ

కొయంబత్తూరు: దేశవాళీ సీజన్ ప్రారంభానికి సూచికగా మంగళవారం నుంచి మొదలవుతున్న బుచ్చిబాబు పోరులో టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్లు సూర్యకుమార్‌యాదవ్, శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్‌ఖాన్ బరిలోకి దిగుతున్నారు. తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ఎలెవన్‌తో జరిగే పోరులో ముంబై తరపున ప్రాతినిధ్యం వహించనున్న వీరిపై అందరి దృష్టి నెలకొన్నది. రానున్న బిజీ సీజన్ దృష్టిలో పెట్టుకుని జాతీయ జట్టులో చోటు ఆశిస్తున్న ఈ ముగ్గురు బుచ్చిబాబు పోరులో సత్తాచాటేందుకు సిద్ధమవుతున్నారు. గాయం కారణంగా టెస్టు జట్టుకు దూరమైన అయ్యర్ తిరిగి ఫామ్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా, సూర్యకుమార్, సర్ఫరాజ్ అదే పనిలో ఉన్నారు. ఇప్పటి వరకు 14 టెస్టులాడిన అయ్యర్ అంతగా ఆకట్టుకోలేకపోతున్నాడు. గతేడాది జనవరి నుంచి 12 ఇన్నింగ్స్‌లో అయ్యర్ 17 సగటుతో 187 పరుగులకే పరిమితమయ్యాడు. ఇందులో 35 అత్యధిక స్కోరు కావడం గమనార్హం. ఇటీవలే టీ20 కెప్టెన్‌గా ఎంపికైన సూర్యకుమార్..టీమ్‌ఇండియా తరపున గతేడాది ఏకైక టెస్టు ఆడాడు. మరోవైపు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ ద్వారా అరంగేట్రం చేసిన ముంబై కెప్టెన్ సర్ఫరాజ్ జాతీయ జట్టులో తన చోటు నిలుపుకోవాలని చూస్తున్నాడు. ఐదు ఇన్నింగ్స్‌లో 50 సగటుతో సర్ఫరాజ్ 200 పరుగులు చేశాడు. మంగళవారం తమినాడుతో జరిగే మ్యాచ్‌లో ముంబై జట్టును సర్ఫరాజ్ ముందుండి నడిపించనున్నాడు. మరోవైపు గత రంజీ సీజన్‌లో అత్యధిక వికెట్లతో ఆకట్టుకున్న సాయికిషోర్..తమిళనాడు జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. ఇదిలా ఉంటే బుచ్చిబాబు టోర్నీతో పాటు వచ్చే నెల 5 నుంచి మొదలవుతున్న దులీప్ ట్రోఫీకి రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్, బుమ్రా దూరమైన సంగతి తెలిసిందే. వచ్చే నెల 19 నుంచి బంగ్లాదేశ్‌తో మొదలయ్యే టెస్టు సిరీస్ నాటికి ఈ స్టార్ క్రికెటర్లు జాతీయ జట్టుతో చేరనున్నారు. బంగ్లాతో సిరీస్ నుంచి టీమ్‌ఇండియా వరుస సిరీస్‌లతో బిజీగా గడపనుంది. స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు టెస్టులు ముగిసిన తర్వాత 20 రోజుల వ్యవధిలో ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. రానున్న సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ బలమైన రిజర్వ్ బెంచ్‌ను సిద్ధంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నది.

జై షా వారసుడిగా జైట్లీ?

ఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా త్వరలోనే ఐసీసీ చైర్మన్ రేసులోకి వెళ్లనుండటంతో అతడి స్థానాన్ని భర్తీ చేసే వ్యక్తి కోసం బోర్డు వేట మొదలుపెట్టిందా? ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) అధ్యక్షుడు, బీజేపీ దివంగత నాయకుడు అరుణ్ జైట్లీ కుమారుడు అయిన రోహన్ జైట్లీ.. జై షా వారసుడిగా ఎంపిక కాబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. సెక్రటరీ పదవికి రాష్ట్రాల అసోసియేషన్ల నుంచి పలువురి పేరు వినిపించినా జై షాతో పాటు బోర్డు రోహన్ వైపునకే మొగ్గు చూపుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇక ఐసీసీ చైర్మన్ రేసులో ఉన్న జై షాకు బోర్డులో 16 మందికి గాను 15 మంది సభ్యుల మద్దతు ఉన్నట్టు తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో అతడు చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేయనున్నట్టు సమాచారం.

బీసీసీఐ మరో తీపి కబురు

దేశవాళీలో మహిళా క్రికెటర్లకు ప్రైజ్ మనీ

ముంబై: దేశంలో మహిళా క్రికెట్ అభ్యున్నతిపై దృష్టి సారించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇక నుంచి దేశవాళీ క్రికెట్‌లో ఆడే మహిళలు, జూనియర్ స్థాయి పోటీలలో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' విజేతలకు నగదు బహుమానం అందజేయనుంది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి జై షా ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించాడు.

హోరాహోరీగా టెన్నిస్ టోర్నీ

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో రాజనర్సింహారావు స్మారక ఐటీఎఫ్ వరల్డ్ జూనియర్స్ అండర్ -18 టెన్నిస్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం బాల బాలికల విభాగాల్లో సింగిల్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరుగగా, మధ్యాహ్నం తర్వాత మెయిన్ డ్రా ఫస్ట్ రౌండ్ కొనసాగింది. బాలికల క్వాలిఫయింగ్ సింగిల్స్‌లో రంగినేని కీర్తన 6-0, 7-5తో అరవింద్ మీరా(ఆస్ట్రేలియా)పై, శాన్వి మిశ్రా 2-6, 6-0, 12-10తో సావర్ణిక విసనకపై గెలిచారు. మెయిన్ డ్రాస్ ఫస్ట్ రౌండ్ సింగిల్స్‌లో వామికా శర్మ 6-3,6-2తో పల్లవి మిస్త్రిపై, సౌమిత్రి చటర్జీ 6-0, 6-0 తో శ్రీనిధి సాయిపై విజయం సాధించింది. బాలుర సెకండ్ రౌండ్ సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో అభిరాం 6-1, 6-2తో సిద్ధార్థపై, మోక్షత్ రెడ్డి 6-0, 6-0తో ప్రత్యుష్‌పై ఘన విజయం సాధించారు. బాలుర ఫైనల్ క్వాలిఫయింగ్‌లో అక్షత్ 7-6, 6-1తో అభిరామ్‌పై పై చేయి సాధించాడు. బాలుర మెయిన్ డ్రా ఫస్ట్‌రౌండ్ సింగిల్స్ లో అంకిత్ రాయ్ 6-4, 7-6తో మాన్యురెడ్డి తోట(యూఎస్ఏ)పై గెలిచాడు. మంగళవారం మెయిన్ డ్రా ఫస్ట్ రౌండ్ పూర్తయ్యాక, సెకండ్ రౌండ్ ప్రారంభం కానుంది. వచ్చే నెల ఒకటో తేదీ వరకు ఈ పోటీలు జరుగనున్నాయి.

సిరీస్ విండీస్‌దే

రెండో టీ20లోనూ సఫారీల పరాభవం

ట్రినిడాడ్: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే వెస్టిండీస్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో టీ20లో కరీబియన్ జట్టు మొదట బ్యాటింగ్ చేస్తూ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. ఓపెనర్ షై హోప్ (22 బంతుల్లో 41, 2 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ రొవ్మన్ పావెల్ (22 బంతుల్లో 35, 1 ఫోర్, 3 సిక్సర్లు) మెరుపులు మెరిపించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా 19.4 ఓవర్లలో 149 పరుగులకే ఆలౌట్ అయింది. రీజా హెండ్రిక్స్ (18 బంతుల్లో 44, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (28) రాణించినా మిడిలార్డర్ వైఫల్యంతో ఆ జట్టు తడబడింది. యువ పేసర్ షమర్ జోసెఫ్ (3/31), రొమారియో షెఫర్డ్ (3/15) ధాటికి సఫారీలు చేతులెత్తేశారు. తొలి టీ20లోనూ విండీస్ విజయం సాధించగా ఈ సిరీస్‌లో నామమాత్రమైన మూడో టీ20 బుధవారం జరుగనుంది.

భారత్‌కు భంగపాటు

శాఫ్ అండర్-20 చాంపియన్‌షిప్ సెమీస్‌లో ఓటమి

ఖాట్మండు (నేపాల్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-20 చాంపియన్‌షిప్ సెమీస్‌లో భారత్‌కు భంగపాటు ఎదురైంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్‌కు సెమీస్‌లో బంగ్లాదేశ్ షాకిచ్చింది. సెమీస్‌లో స్కోర్లు 1-1తో సమంకాగా పెనాల్టీ షూటౌట్ ద్వారా తేలిన ఫలితంలో బంగ్లాదేశ్ 4-3తో భారత్‌ను ఓడించి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. బంగ్లాదేశ్ ఆటగాడు అసదుల్ ఇస్లాం సకిబ్ 36వ నిమిషంలో గోల్ చేయగా భారత్ తరపున రికీ మెటీ హోబమ్ 74వ నిమిషంలో గోల్ కొట్టి స్కోర్లను సమం చేశాడు. పెనాల్టీలలో భారత్ మూడు గోల్స్ మాత్రమే చేయగా బంగ్లా 4 గోల్స్ సాధించింది. ఆట ఆరంభంలోనే రెండు పెనాల్టీలను వదిలేసుకున్న భారత్ అందుకు తగిన మూల్యం చెల్లించుకుంది. బుధవారం జరుగబోయే ఫైనల్స్‌లో బంగ్లాదేశ్.. నేపాల్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.